క్లుప్తంగా

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గద్వాల క్రైం: కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా గద్వాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో దాడిలో గాయపడిన కార్యకర్తలను ఆమె పరామర్శించి మాట్లాడారు. మల్దకల్ మండలం పెద్దపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడం విచారకమన్నారు. ఈ దాడి విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అప్లైడ్ న్యూట్రీషన్ సబ్జెక్టు–1 అతిథి అధ్యాపక నియమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీలోగా కళాశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత, బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న ఉదయం 11గంటలకు ఎంఏఎల్‌డీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు.

ఆరు మండలాల బీజేవైఎం అధ్యక్షుల రాజీనామా

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల బీజేవైఎం అధ్యక్షులు రాజీనామ చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలోని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎలాంటి ప్రచారానికి పిలుపు ఇవ్వడం లేదని, పార్టీకి సంబంధించిన ఎలాంటి సమాచారం రావడం లేదని పేర్కొన్నారు. అందుకే అయిజ, వడ్డేపల్లి, ఇటిక్యాల, అలంపూర్ టౌన్, ఉండవెల్లి, మానవపాడు మండలాలకు చెందిన బీజేవైఎం అధ్యక్షులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీలో కార్యకర్తలుగా కొనసాగుతామని తెలిపారు. బీజేవైఎం అధ్యక్షులు పాల్వాయి వెంకటేష్‌గౌడు, వెంకటేష్ యాదవ్, మధు, శరత్, రాజేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు



రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల కింద నిర్మించిన దిమ్మెలు పగుళ్లు వచ్చి ఏళ్లు గడుస్తున్నా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు పేర్కొన్నారు. దిమ్మెలు నిర్మించి సంవత్సరాలు దాటింది. అవి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేరు. దిమ్మెలు కూలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశముంటుందని, అధికారులు ఇప్పటికైనా అప్రమత్త మై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని మండల మహిళా సమాఖ్య ద్వారా గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఏపీఎం బిచ్చన్న రైతులను కోరారు. సోమవారం సంగినేనిపల్లి, బొల్లారం ఇతర గ్రామాలలో మహిళా సంఘ సభ్యులు, రైతులతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని తెలిపారు. సీసీ మాధవస్వామి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని ఐకేపీ సీసీలు నాగరాజు, స్వామి, ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రాయినిపల్లి, కేతేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తారని పేర్కొన్నారు. తూకం విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు నిర్వహించాలన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: గద్వాల ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు పదవి కాంక్షతో ఎన్నికల్లో పోటీలో నిలబడి ఈ ప్రాంతంలో కల్లోలాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోతే గద్వాలలో అరాచకమే రాజ్యమేలుతుందని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగిందని, జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. సోమవారం గద్వాల పట్టణం, గద్వాల, ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలన అంటేనే స్కాముల పాలన గుర్తుకొస్తుందని విమర్శించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్‌పార్టీ పరిపాలన చూశామన్నారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ అవినీతి అక్రమాలకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయని పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల భరోసా కోసం ప్రత్యేకంగా సఖీ కేంద్రాలు, షీ టీం బృందాలు ఏర్పాటు చేసి పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టామన్నారు. ఇలాంటి తరుణంలో అవినీతికి మారుపేరుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలకు మోసపోతే పూర్తిగా నష్టపోతామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఈ ఐదేళ్లు అభివృద్ధి కోసం కృషి చేశానని, మరోసారి విచక్షణతో ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే గెలిచాక మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

గద్వాలను మరింత అభివృద్ధి చేసుకుందాం..

సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని గద్వాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, ఈపట్టణ భవిష్యత్ ప్రజల చేతిలోనే ఉందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గద్వాల పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళ్తున్నామని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సిన అవసరముందన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే తనయుడు సాకేత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, మైనార్టీబంధు, బీసీబంధు, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే గద్వాల పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, కౌన్సిలర్, దౌలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం సభకు హాజరైన ప్రజలు

కాంగ్రెస్ అంటేనే కష్టాలు

గట్టు: కాంగ్రెస్‌తో కష్టాలను కొనితెచ్చుకోవద్దని గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం చాగదోణ, అంతంపల్లి, లింగాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో కరెంట్, తాగు నీటికి కష్టాలు పడినట్లు తెలిపారు. రైతుల కష్టాలు తొలగించింది బీఆర్ఎస్ పార్టీ అని, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో ఆదుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చిన కర్ణాటక రాష్ట్ర ప్రజల కష్టాలను తెలుసుకోవాలని ఓటర్లకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఓటర్లు బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, నాయకులు రామన్‌గౌడు, వెంకట్రాములు, గడ్డం కృష్ణారెడ్డి, హనుమంతు, గద్వాల తిమ్మప్ప, మునిచంద్రగౌడు పాల్గొన్నారు.



చాగదోణలో మాట్లాడుతున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

పకడ్బందీగా తనిఖీ చేపట్టాలి



చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకుడు వసంత్‌కుమార్

కేటీదొడ్డి: ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఐఏఎస్ అధికారి వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణంగా పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కర్ణాటక గోవా నుంచి వచ్చే మద్యం, నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు బంగారాన్ని సీజ్ చేయాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాను అమర్చాలని ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు

మద్యం పట్టివేత

మానవపాడు: అక్రమంగా మద్యం తరలించిన, బెల్ట్‌షాపులలో మందు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము తెలిపారు. సోమవారం బైక్‌పై మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. కలుకుంట్లకు చెందిన చాకలి వెంకటేష్ మానవపాడులో మద్యం షాపు నుంచి 11.5లీటర్ల (విలువ రూ.12వేలు) మద్యాన్ని తీసుకెళ్తుండగా, అమరవాయి శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు. తనిఖీలో పోలీసులు ఉన్నారు.

శాంతినగర్: పోలీసుల తనిఖీలో భాగంగా ఆదివారం రాత్రి రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా మద్యం కాటన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. పీఅండ్ఈఎస్ఐ బృందం అయిజ పట్టణంలోని మేడికొండ చౌరస్తాలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరేష్, బోయ ఎంకన్న, గోరంట్ల రవీందర్‌పై కేసులు నమోదు చేసి మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



పట్టుబడ్డ మద్యం కాటన్లతో పోలీసులు, నిందితులు

కార్తీక దీపోత్సవం



ఉండవెల్లిలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఉండవెల్లి: మండలంలోని శివాలయాలలో కార్తీక సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు, మహిళలు దీపోత్సవంలో భాగంగా దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో నందికోల శావ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గౌరిశంకరయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

కార్తీక మాస ప్రత్యేక పూజలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దూరులోని తుంగభద్ర నదీతీరంలో వెలిసిన సైకత లింగానికి కార్తీక మాసం ప్రత్యేక పూజలు చేశారు. ఏ బుర్థిపాడులో మహిళలు, యువకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.



మద్దూరులో శివలింగానికి పూజలను నిర్వహిస్తున్న మహిళలు

శివాలయంలో ప్రత్యేక పూజలు

అయిజ: మండల కేంద్రంలోని గుంత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసంలోని సోమవారం కావడంతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున శివ లింగానికి అభిషేకాలు చేశారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతంలో హోమం నిర్వహించారు. శివమాల ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. స్వామివారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

జోరుగా ప్రచారం

● జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ, దౌదర్‌పల్లి, ఒంటలపేట కాలనీలతో పాటు పాతబస్టాండు దుకాణాల వద్ద సోమవారం బీఎస్పీ అభ్యర్థి అతిఖుర్ రహ్మాన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి తెలిపారు. మల్దకల్, అమరవాయి, తాటికుంట, నాగర్‌దొడ్డిలో ప్రచారం నిర్వహించారు.

● అలంపూర్ మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కాశీపూర్‌లో గోకారి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరించారు.

● అలంపూర్ నియోజకర్గంలో నూతన శకం మొదలు కాబోతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అలంపూర్ బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌తో కలిసి రాజోళి మండలంలోని చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● గత పాలకుల నిర్లక్ష్యంతో గద్వాల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని 13,29వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● కాంగ్రెస్ ప్రతి కార్యకర్త కీలకంగా పని చేసి, పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి రేవన్న పిలుపునిచ్చారు. గద్వాల జిల్లా కేంద్రంలో జమ్మిచేడులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఆధ్వర్యంలో బూత్ లెవల్ కార్యకర్తల శిక్షణలో మాట్లాడారు.

● గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సరితతోనే సాధ్యమని మాజీ ఎంపీపీ సవారమ్మ, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మల్దకల్ మండలంలోని అమరవాయి, పెద్దపల్లి, మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

● బహుజన బిడ్డ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థి సరితను ప్రజలు ఆదరించాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, ఆలూరు ప్రకాష్‌గౌడు కోరారు. గట్టు మండలంలోని బోయలగూడెం, ఇందువాసిలో ప్రచారంలో పాల్గొన్నారు.

● అధికారంలోకి రాగానే ఆరు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రవల్లి మండలంలోని వేముల, బట్లదిన్నెలో ఆయన ప్రచారం చేశారు.

● గద్వాల నియోజకవర్గంలో దళితులపై దాడులు ఆగడం లేదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాష్ అన్నారు. ధరూరు మండలంలోని గుడ్డెందొడ్డి, మాల్‌దొడ్డి గ్రామాల్లో పర్యటించి విలేకర్లతో మాట్లాడారు.

● ప్రజల సమస్యలు పరిష్కరించని పాలకులెందుకు అని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ధరూరు మండలంలోని గుడ్డెందొడ్డి, మాల్‌దొడ్డి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

● బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్ వడ్డేపల్లి మండలంలోని తనగల, పచ్చర్ల, కొంకలలో ప్రచారం నిర్వహించారు.

● కేసీఆర్ ప్రభుత్వం 50వేల ఎకరాల్లో సాగునీరు అందించేందుకు గాను రూ.లక్షా 30 వేల కోట్లతో నాణ్యతలేని కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఆయన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు.

ప్రతి ఓటరుకు పోల్ స్లిప్పులు అందించాలి

కేటీదొడ్డి: అర్హులైన ప్రతి ఓటరుకు పోల్‌స్లిప్పులు అందించాలని తహసీల్దార్ సరితరాణి బీఎల్‌ఓలకు సూచించారు. సోమవారం మండలంలోని రంగాపురంతండాలోని పోల్‌స్లిప్పుల పంపిణీని ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వారీగా వచ్చిన పోల్‌స్లిప్పులను ఆయా ఓటర్లకు అందించాలని, విధుల నిర్వాహణలో అలసత్వం వహించే బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఓటర్లు ఉన్నారు.

ఓటర్లకు స్లిప్పుల పంపిణీ

అయిజ: ఈనెల 30న శాసన సభ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికి తిరిగి ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేశారు. మొత్తం 26 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బీఎల్‌ఓలు ప్రతి ఓటరును కలిసి వారితో సంతకం చేయించుకొని స్లిప్పులు అందజేశారు. బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు.



ఓటర్‌స్లిప్‌ల పంపిణీ తనిఖీ చేసిన తహసీల్దార్ సరితరాణి

తనగలలో పోలీసు కవాతు



తనగలలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

శాంతినగర్: శాసన సభ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల్లో సీఏపీఎఫ్ కేంద్ర బలగాలు సోమవారం పోలీసు కవాతు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు శాంతినగర్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండలంలోని తనగలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్ అనంతరం గ్రామంలో పోలీస్ కళా బృందంతో సీ విజిల్ యాప్, యువకులకు ఎన్నికల కోడ్ నియమాలు, ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 30న జరగబోయే శాసన సభ ఎన్నికలను గ్రామాల్లో స్వేచ్ఛగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నగదు, మద్యం కానుకలను బహుమతులు రూపంలో ప్రలోభ పెట్టడం, భయ భ్రాంతులకు గురిచేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం గొడవలు, సృష్టించడం వంటివి చేస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి, కేంద్ర బలగాలు, కళాజాత బృందం సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, హన్మంతు, కృష్ణ, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ ముషాహిదా బేగం

గద్వాల అర్బన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని డీడబ్ల్యూఓ ముషాహిదా బేగం అన్నారు. ప్రపంచ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యం పిల్లల హక్కు అని, వారందరు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలన్నారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు, లైంగిక వేధింపుల వంటి సమస్యలతో ఇబ్బందులకు గురైతే 1098 లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీసీపీఓ నర్సింహ, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్, చైల్డ్‌లైన్ సిబ్బంది జయన్న ఉన్నారు.

హక్కులను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ

బాలలందరు వారి హక్కులను పరిరక్షిస్తామని పేర్కొంటూ సోమవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో డీడబ్ల్యూఓ ముషాహిదా బేగం బాలలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2006 జనవరి 20న అమల్లోకి వచ్చిందని తెలిపారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాలలు అభివృద్ధి పొందే హక్కు, జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్య హక్కులను పిల్లలందరు సంపూర్ణంగా పొందేలా కృషి చేస్తానని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, సీడబ్ల్యూసీ చైర్మన్ సహదేవుడు, సభ్యురాలు జయభారతి ఉన్నారు.

తొలిదశ ఉద్యమకారులను విస్మరించారు

గద్వాల అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిదశ ఉద్యమకారులను విస్మరించిందని 1969ఉద్యమకారులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 1969లో రాష్ట్ర సాధనలో అమరులైన పాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమకారులను రాష్ట్రం ఏర్పాటు తర్వాత పట్టించుకోలేదన్నారు. తూతూ మంత్రంగా కొందరికి మాత్రమే సాయం అందించి చేతులు దులుపేసుకున్నారన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో తొలిదశ అమరవీరుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, నెలకు రూ.25వేల పెన్షన్, హెల్త్‌కార్డులు, 250గజాల స్థలం ఇవ్వాలని పేర్కొనడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మోహన్ రావు, రామన్‌గౌడ్, సాంబశివుడు, వెంకటకృష్ణారెడ్డి, ప్రభాకర్, కొట్టం రవి ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న 1969ఉద్యమకారులు

తండాలను పంచాయతీలుగా చేసింది బీఆర్ఎస్సే

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాలోని నూతనంగా సేవాలాల్ నూతన దేవాలయంలోని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తండాలలో గిరిజనులను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని, వారి కులదైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాలను ఏనాడు గ్రామంలో ఏర్పాటు చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ తండాలను ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, సర్పంచు సక్రీయనాయక్, నాయకులు హనుమంతు, చక్రదర్, టీచర్ గోవిందు, కొండన్న, నసీర్, నరేందర్, వీరన్న, రవి పాల్గొన్నారు.



సేవాలాల్ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ఎర్రవల్లిచౌరస్తా: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్‌తో పాటు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇటిక్యాల గురుకుల పాఠశాలకు చెందిన రంగస్వామి, ఉదయ్‌కిరణ్, విష్ణువర్ధన్, కార్తిక్, నిఖిల్‌తో పాటు ఎర్రవల్లి (అయిజ) గురుకుల పాఠశాలకు చెందిన సిద్ధార్థ్, ప్రశాంత్, రాజశేఖర్, అశోక్‌లు ఈనెల 18 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ సేపక్‌తక్రా క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని పొందిన విద్యార్థుల బృందంతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల పీడీ భాస్కర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాళ్లు గిరిధర్, రాంమూర్తి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మైదానాల్లేక క్రీడలకు దూరం..



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆటలాడుతున్న విద్యార్థులు

● పాఠశాలల్లో క్రీడలపై ప్రోత్సాహం కరువు
● మైదానాల ఏర్పాటులో అధికారుల అలసత్వం

అయిజ: మండల కేంద్రం, వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు నేర్పించాలని నిబంధనలున్నా అధికారులు నిర్లక్ష్యంతో నీరుగారుతున్నాయి. మండలంలో చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభను కనబరుస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి వివిధ ఆటవస్తువులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 28 ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. వాటితోపాటు ఉర్దూ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడామైదానాలు ఏర్పాటుచేసి వారికి కావల్సిన ఆటవస్తువులను సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.